# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 01-03-2026** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్ లో న్యాయస్థానాలకు సంబంధించిన పలు అభివృద్ధి పనులకు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఈ రోజు శంఖుస్థాపన చేయనున్నారు.**

2. **వేటపాలెం ఘటనలో మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తరపున 20 లక్షల రూపాయలు చొప్పున నష్టపరిహారం అందిస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రకటించారు.**

3. **తెలంగాణాలో 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' కార్యక్రమం చేపడుతున్నట్లు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి వెల్లడించారు.**

4. **బిసిల సాధికారతకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆంధ్రప్రదేశ్ బిసి సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత పేర్కొన్నారు.**

5. **ఆంధ్రప్రదేశ్ లోని దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.**

=========================

రాష్ట్రంలో న్యాయస్థానాలకు సంబంధించిన పలు అభివృద్ధి పనులకు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఈరోజు శంఖుస్థాపన చేయనున్నారు. తిరుపతిలో నిర్మించనున్న జిల్లా కోర్టు కాంప్లెక్స్ కు ఉదయం శంఖుస్థాపన చేయనున్నారు. అనంతరం రాజధాని అమరావతిలోని ఆంధ్రప్రదేశ్ జ్యుడిషియల్ అకాడమీ, ఆంధ్రప్రదేశ్ హై కోర్టు అతిథి గృహ నిర్మాణాలకు ఈ మధ్యాహ్నం శంఖుస్థాపన చేయనున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. అనంతరం విజయవాడలో మధ్యవర్తిత్వంపై రాష్ట్రస్థాయి సదస్సులో ఆయన పాల్గొంటారు. ఈ నేపథ్యంలో ఆయన గత రాత్రి తిరుపతి చేరుకున్నారు. రేణిగుంట విమానాశ్రయంలో ఆయనకు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాగూర్ తోపాటు పలువురు ఇతర న్యాయమూర్తులు, అధికారులు స్వాగతం పలికారు.

-------------------------

కాకినాడ జల్లా వేట్లపాలెం బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడు ఘటన కారణంగా మృతి చెందిన వారి కుటుంబాలు ఒక్కింటికి రాష్ట్ర ప్రభుత్వం తరపున 20 లక్షల రూపాయలు చొప్పున నష్టపరిహారం అందిస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రకటించారు. ప్రమాదం విషయం తెలుసుకున్న వెంటనే ఆయన

హెలీకాప్టర్‌లో గత రాత్రి సామర్లకోటకు చేరుకున్నారు. ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం సామర్లకోట, కాకినాడ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. ఈ ఘటనలో 20 మంది చనిపోగా, తొమ్మిది మంది పరిస్థితి విషమంగా ఉందన్నారు. అనంతరం కాకినాడలో ముఖ్యమంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ..

వాయిస్.. 30 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని గుంటూరు జిల్లా పెదకాకాని మండలం, నంబూరు గ్రామంలో ముస్లిం మైనారిటీ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ నిన్న శంకుస్థాపన చేశారు. మొత్తం 10 కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి 4 కోట్ల రూపాయలను దాతలు విరాళంగా అందించారని కేంద్రమంత్రి తెలిపారు. ఈ సందర్భంగా పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ,

.. వాయిస్.. 25 సెకన్లు

---------------------------

యాజమాన్యాలు భద్రతా ప్రమాణాలు పాటించకపోవడమే వేట్లపాలెం బాణసంచా తయారీ యూనిట్ లో పేలుడుకు కారణమని ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. కాకినాడ జీజీహెచ్ లో వేట్లపాలెం పేలుడు మృతుల కుటుంబాలు, క్షతగాత్రులను మంత్రులు వి.అనిత, పి.నారాయణలతో కలిసి ఆయన గత రాత్రి పరామర్శించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ.. 8 మంది పని చేసేందుకు అనుమతి ఉన్న ప్రదేశంలో 31 మంది చేత పని చేయిస్తున్నట్లు చెప్పారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నిబంధనలు మరింత కఠినతరం చేస్తామని చెప్పారు.

---------------------------

ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను రాష్ట్ర ప్రజలకు మరింత చేరువ చేయాలనే సంకల్పంతో 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' కార్యక్రమం చేపడుతున్నట్లు తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి వెల్లడించారు. హైదరాబాదులోని రాష్ట్ర సచివాలయంలో అన్ని శాఖల ఉన్నతాధికారులతో ఆయన నిన్న సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఈ నెల 6వ తేదీ నుంచి జూన్ 12 వరకూ 99 రోజులపాటు రాష్ట్రంలో ఈ ప్రణాళికను అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. జూన్ 2వ తేదీన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని రాష్ట్రంలోని 4 కోట్ల మంది ప్రజలు పండుగను సంబరంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు.

---------------------------

బిసిల సాధికారతకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆంధ్రప్రదేశ్ బిసి సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత పేర్కొన్నారు. శ్రీ సత్యసాయి జిల్లా పరిగి మండలంలోని కొడిగినహళ్లి వద్ద 1 కోటి 80 లక్షల రూపాయలతో నిర్మించనున్న బిసి విద్యార్థుల వసతి గృహానికి ఆమె నిన్న శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు సమపాళ్లలో ముందుకు సాగుతున్నాయన్నారు.

---------------------------

ఆంధ్రా విశ్వవిద్యాలయానికి పూర్వవైభవం తీసుకువస్తామని విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాల నిర్వహణపై అధికారులతో విశాఖపట్నంలో మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయాన్ని ప్రపంచంలోనే సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ గా తీర్చిదిద్దేందుకు శతాబ్ది ఉత్సవాలు వేదిక కావాలన్నారు. మార్చి 26 నుంచి ఏప్రిల్ 26వ తేదీ వరకూ పూర్వ విద్యార్థులతో మమేకం కావడంతో పాటు శతాబ్ది ఉత్సవాల్లో వారిని భాగస్వాములను చేయాలని సూచించారు. శతాబ్ది ఉత్సవాల్లో ఆంధ్ర విశ్వవిద్యాలయం ఘన చరిత్ర ప్రతిబింబించాలని, ఇందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

---------------------------

మైనార్టీ యువతకు వృత్తి నైపుణ్యాలను పెంపొందించి, ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో కేంద్ర మైనార్టీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ పీఎం వికాస్ పథకాన్ని ప్రారంభించిందని ఆంధ్రప్రదేశ్ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. నంద్యాల జిల్లా కేంద్రంలోని నేషనల్ డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్, పీఎం వికాస్ సంయుక్త ఆధ్వర్యంలో నైపుణ శిక్షణ కేంద్రాన్ని ఆయన నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు.

---------------------------

పెద్దపల్లిలో అతి త్వరలో మహిళల సాధికారతకు సంబంధించిన వి హబ్ కార్యాలయాన్ని ప్రారంభిస్తామని తెలంగాణ ఐటీ శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు పేర్కొన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని పెదపల్లి జిల్లా, మంథనిలో నిర్వహించిన ఇన్నోవేషన్ ఎక్స్ పోలో ఆయన నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏఐకి సంబంధించి ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ..

....వాయిస్..25 సెకన్లు

---------------------------

రాష్ట్రంలోని దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దివ్యాంగుల సంక్షేమం కోసం 'ఇంద్ర ధనస్సు' కార్యక్రమంలో భాగంగా ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇటీవల ప్రకటించారు. స్త్రీ శక్తి పథకం వర్తించే అన్ని బస్సుల్లోనూ దివ్యాంగులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. ఇతర బస్సులలో 50 శాతం రాయితీ కల్పిస్తూ నిర్ణయం తీసుకుంది.

---------------------------

ఐసిసి పురుషుల టి 20 వరల్డ్ కప్ లో భాగంగా సూపర్-8 విభాగంలో భారత్, వెస్టిండీస్ జట్లు ఈరోజు తలపడుతున్నాయి. కోల్ కతాలోని ఈడెన్ గార్డెన్స్ లో రాత్రి 7 గంటలకు మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టుకు సెమీస్‌కి వెళ్లేందుకు అవకాశం లభిస్తుంది. అంతకు ముందు సూపర్ 8 విభాగంలో ఢిల్లీలోని అరుణ్ జేట్లీ స్టేడియంలో జింబాంబ్వే, దక్షిణాఫ్రికా జట్లు ఈ మధ్యాహ్నం 3 గంటలకు తలపడనున్నాయి.

---------------------------

ఆంధ్రప్రదేశ్, యానాంలలో దిగువ ట్రోపో ఆవరణంలో ఆగ్నేయ, నైరుతి దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. వీటి ఫలితంగా కోస్తా ఆంధ్ర, యానాం, రాయలసీమల్లో ఈరోజు పొడి వాతావరణం ఏర్పడే అవకాశము ఉందని వాతావరణ కేంద్ర అధికారి ఎం.వెంకట్రావు పేర్కొన్నారు. ఒకటి రెండు చోట్ల పొగమంచు కురిసే అవకాశం ఉందని వెల్లడించారు. రానున్న మూడు రోజులలో కోస్తాఆంధ్రలో కనిష్ట ఉష్ణోగ్రతలు 2 నుంచి 3 డిగ్రీల సెంటిగ్రేడ్ మేర అధికంగా నమోదయ్యే అవకాశం ఉందన్నారు. తెలంగాణలో రానున్న 5 రోజుల పాటు పొడి వాతావరణం నెలకొంటుందని హైదరాబాదులోని వాతావరణ కేంద్రం పేర్కొంది.

======================